క్లుప్తంగా

వైభవంగా వనువులమ్మ జాతర


వనువులమ్మ తల్లి

అంబాజీపేట: చిరత పూడి గ్రామంలో వేంచేసిన వనువులమ్మ అమ్మవారి తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి జాతరను కనుల పండువగా నిర్వహివంచారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు చూపరులను కనువిందు చేశాయి. జాతరను పురస్కరించుకుని గ్రామ ఆడపడుచులు, మహిళలు, భక్తులు అమ్మవారికి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు.

హనుమజ్జయంతి మహోత్సవాలు


అంబాజీపేటలో పందిరి రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

అంబాజీపేట: స్థానిక పశువుల మార్కెట్ వద్ద ఉన్న భక్తాంజనేయ స్వామి వారి హనుమజ్జయంతి వేడుకను వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆలయం వద్ద పందిరి రాట ముహూర్తాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రమౌళి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే రోజున ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గల్ఫ్ యువనేస్తం సేవలు అభినందనీయం


దుర్గాప్రసాద్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న గ్రూపు సభ్యులు

మలికిపురం: రాజోలు దీవి కేంద్రంగా గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనారోగ్యంలో బాధపడుతున్న గున్నేపల్లి అగ్రహారానికి చెందిన దంగేటి దుర్గాప్రసాద్‌కి వైద్య ఖర్చుల నిమిత్తం సంస్థ సమకూర్చిన రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. సమావేశంలో సంస్థ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు కృష్ణార్జునులు, సత్తిబాబు, సూర్యచంద్ర ప్రకాష్, గోవర్ధన పద్మ కుమారి, నాగరాజు, వాసు, గ్రామ పెద్దలు కాండ్రేగుల రాంబాబు, కాండ్రేగుల నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీను పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులు రూ.18,500 నగదును ఆర్థిక సాయంగా ఆదివారం అందజేశారు. మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన చింతపల్లి సత్యగౌరికి టీబీ కారణంగా నరాలు చచ్చుపడిపోవడం వలన ఆవిడ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. వైద్య నిమిత్తం వాళ్లు అక్షయ సేవా సంస్థను ఆర్థిక సహాయం కోరారు. దీంతో సేవా సంస్థ సభ్యులు రావులపాడు గ్రామం వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఘనంగా సోమాలమ్మ జాతర

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామ పంచాయతీ పరిధి చీకట్లపాలెంలో వేంచేసి ఉన్న సోమాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, నైవేద్యాలు చెల్లించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అన్నసమారాధన నిర్వహించారు.

వెదురుపాకలో నేడు పోలేరమ్మ జాతర

రాయవరం: మండలంలోని వెదురుపాకలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ వారికి జాతర నిర్వహించనున్నారు. ఏటా వైశాఖ పౌర్ణమి తర్వాత వచ్చే సోమవారం రాత్రి జాతర, మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పిల్లా పాపలను, పాడి పంటలను, పసుపుకుంకాలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి ఏటా జాతరను నిర్వహించడం పరిపాటి. జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. జాతర సందర్భంగా బ్యాండు మేళాలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తునారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయం వద్ద తీర్థం ప్రారంభం అవుతుంది.

పోషకాల గని... నేరేడు



- వేసవిలో విరివిగా లభ్యం
- మార్కెట్‌లో కిలో ధర రూ.200

ఆలమూరు: ప్రకృతి ప్రసాదించే ఆహార పదార్థాల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే నేరేడుపండును సక్రమంగా వినియోగించుకుంటే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు తినడం వల్లే కాదు ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి చక్కని మేలు చేస్తుంది. నేరేడుపండులో అత్యధిక పోషకాలు ఉన్న దృష్ట్యా పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌లు తయారు చేసుకోవచ్చు. నేరేడు కాయలను వెనిగర్, వైన్‌ను తయారీలో ఉపయోగిస్తారు. మన్యం, చాగల్నాడు ప్రాంతాలతో పాటు గోదావరి పరీవాహక లంక భూముల్లో ఈ నేరేడు పండ్లు విరివిగా లభిస్తాయి. ఈ నేరేడుపండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడంతో ధర కూడా అదే విధంగా ఉంటుంది. రైతు దగ్గర దళారులు కేజీ రూ.80 కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.150కి విక్రయిస్తారు. వినియోగదారులకు చేతికొచ్చేసరికి రూ.200 పలుకుతుంది. అందులో నాణ్యమైన నేరేడుపండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. వేసవి సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులకు అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. నేరేడుపండును మితంగా తింటే ఆరోగ్యాన్ని, అపరిమితంగా తింటే అనారోగ్యాన్ని కలుగ చేస్తాయని వారు హెచ్చరిస్తున్నారు.

ఖనిజ లవణాలు పుష్కలం



నేరేడుపండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. దీనివల్ల శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తుంది. అన్ని వేళల్లో ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంది.

– పి.భవానీశంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదపళ్ల

నేరేడు పండు వల్ల కలిగే ప్రయోజనాలు

- నేరేడు పండ్లతో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కల్పిస్తాయి.
- మూత్ర సమస్యలు నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. – కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయ పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా ఉంటుంది.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకు పోయిన వెంట్రుకలను కరిగించడానికి ఈ నేరేడు పండు దోహదపడుతుంది.

నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు

- నేరేడుపండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు.
- వగరు రుచి కలిగిన నాణ్యత లేని నేరేడుపండ్లు భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు. సీజన్ మారే సమయంతో ఈ పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం రోగం ఉన్నవారు ఈ పండ్లను ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలికమైన శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- నేరేడుపండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం


చికిత్స పొందుతున్న లతకు ఆర్థిక సాయం అందిస్తున్న వైస్ ఎంపీపీ దీవెనకుమారి

రాజోలు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా కార్యకర్త పోలుకొండ లతకు సఖినేటిపల్లికి చెందిన రత్న చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించింది. సోషల్ మీడియా ద్వారా పార్టీకి సేవలు అందించిన లత ప్రస్తుతం అనారోగ్యంతో రాజోలులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ సమాచారం తెలుసుకున్న సఖినేటిపల్లి మండల ఉపాధ్యక్షురాలు రాపాక దీవెనకుమారి సోదరుడు గొల్ల విజయ్‌ప్రకాష్ ఆర్థికసాయాన్ని సమకూర్చారు. నాయకులు సూర్యప్రకాష్, తాడి సహదేవ్, కానూరి రంజిత్‌కుమార్, గొల్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

తాళ్లరేవు: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల ఇలవేల్పు పళ్లాలమ్మ

- నేడు పెద్ద జాగారం, తాళ్లు లేపడం
- రేపటి నుంచి తీర్థ మహోత్సవాలు ప్రారంభం, సిరిబండి ఉత్సవం

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవతగా, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న పళ్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం పాలక మండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న తెలిపారు. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నుంచి తీర్థ మహోత్సవాలు ప్రారంభమై నెలరోజుల పాటు జరగటం పూర్వం నుంచీ ఆనవాయితీ. ఆ ప్రకారం నెల రోజుల ముందు నుంచి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ తీర్థ మహోత్సవాలకు కోనసీమ నుంచే కాకుండా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచీ అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. అందుకు అనుగుణంగా జాతరలు, తీర్థ మహోత్సవాలకు కమిటీ చైర్మన్ అమ్మన్న ఆధ్వర్యంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.


వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారు

సీతాదేవి కొలిచిన ప్రకృతిమాత పళ్లాలమ్మ

పూర్వం గౌతమీ నదీ తీరాన వానరపల్లిగా పిలవబడిన ప్రాంతమే నేటి వానపల్లి గ్రామం. ఈ పంచాయతీ పరిధిలో ఒక శివారు గ్రామాన్ని కోతులతోటగా పిలుస్తారు. నాడు ఈ వానరపల్లి ప్రాంతంలో సీతారాములు వనవాసం చేసినట్టు స్థల పురాణంలో పేర్కొన్నారు. ఆనాడు ప్రకృతి నుంచి ఆవిర్భవించిన అమ్మవారు సీతాదేవికి దర్శనమిచ్చిందని అలా సీతాదేవి ప్రకృతి మాతను ప్రకృతిలో కాసిన పండ్లతో పూజించేది. పండ్లతో పూజింపబడే మాత కావడం వలన పళ్లాలమ్మగా కొలుస్తున్నారు. దర్శించుకున్న భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, సంతానం లేని దంపతులకు సంతానం ప్రసాదించే తల్లిగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రజల పూజలందుకుంటుంది. కోనసీమను సస్యశ్యామలం చేయడంలో భాగంగా సర్ ఆర్థర్ కాటన్ కాలువ తవ్వించినప్పుడు పళ్లాలమ్మ ఆలయం అడ్డురాగా, ఆలయాన్ని తొలగించకుండా, ఏ విధంగానూ చెక్కు చెదరకుండా అక్కడ కాలువను వంపు తిప్పి తవ్వించినట్టు పూర్వీకులు చెప్పేవారు. దానికనుగుణంగానే ఆలయం వెనుక కొంత దూరంలో కాలువ వంపు తిరిగి ఉంటుంది. జాతర తీర్థ మహోత్సవాల్లో భాగంగా సిరిబండి మహోత్సవానికి, ఉయ్యాలకు సంబంధించి ఆదివారం రెండు తాటిచెట్లను కొట్టారు. రాత్రి చిన్నజాగరం ఘనంగా నిర్వహించారు. సోమవారం మరో తాటిచెట్టును కొట్టి ఆలయం వద్దకు తెచ్చి లేపుతారు. మంగళవారం నుంచి తీర్థహోత్సవాలు ప్రారంభం కాగా ఆదే రోజు సాయంత్రం సిరిబండి ఉత్సవం జరుపుతారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ అమ్మన్న తెలిపారు.

తైక్వాండోకు పెరుగుతున్న ఆదరణ


అంబాజీపేటలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందేందుకు ఇటీవల తైక్వాండోపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణా శిబిరంలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. ఎక్కువగా బాలికలు అధికంగా పాల్గొని శిక్షణ పొందుతున్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికే కాకుండా ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ఉపయోగమనే లక్ష్యంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు పర్యవేక్షణలో సుమారు 20 ఏళ్లుగా తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలోను, 150 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఉన్నారు. బ్లాక్ బెల్ట్ పొందిన క్రీడాకారులు 30 మంది, నేషనల్ రిఫరీలుగా విధులు నిర్వహిస్తున్న వారు 9 మంది ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులను సైతం తైక్వాండో వైపే వారి తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. వేసవి శిక్షన పూర్తయిన అనంతరం కూడా శిక్షణ తరగతులను ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తామని త్రిమూర్తులు తెలిపారు.

పంట కాలువలపై దృష్టి సారించరూ!


మురుగు కాలువను తలపిస్తున్న పంట కాలువ

- కనీస మరమ్మతులు చేపట్టరూ..
- రైతుల విజ్ఞప్తి

మామిడికుదురు: కొంతమంది నిర్లక్ష్యంతో పంట కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. పలు చోట్ల కాలువ గట్లు బలహీనంగా మారాయి. వీటికి తోడు పంట కాలువల్లోకి మురుగునీటి తూరలను ఏర్పాటు చేయడం వల్ల అవి కాలుష్యం బారిన పడుతున్నాయి. పంట కాలువల్లో ప్రవహించే సాగు నీటినే తాగునీటి ప్రాజెక్టులకు మళ్లిస్తున్నారు. దీని వల్ల అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం మండలం నాగుల్లంక నుంచి మొదలు కొని మొగలికుదురు, గెద్దాడ, పెదపట్నం, నగరం, మామిడికుదురు, పాశర్లపూడి, ఈదరాడ, కొమరాడ, ఆదుర్రు, మగటపల్లి, తదితర గ్రామాలకు సాగునీటిని అందించే పంట కాలువల్లోకి యథేచ్ఛగా మురుగునీటి తూరలు ఏర్పాటు చేశారు. గతంలో పలు పర్యాయాలు మురుగునీటి తూరలను తొలగించినా షరా మామూలే. ఎవరికి వారు తమ స్వార్థం కోసం పంట కాలువల్లోకి లెట్రిన్, మురుగునీటి తూరలను సైతం ఏర్పాటు చేసి పంట కాలువలను డ్రైన్ల తరహాలో మార్చేశారు. కాలువలపై ఇరిగేషన్ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మురుగునీటి డ్రైన్ల తరహాల్లో పంట కాలువలు మారిపోయాయి.

దిగబడిపోతున్న గట్లు..

మామిడికుదురు కొర్లగుంట రోడ్డులో పంట కాలువ గట్టు దిగబడిపోయింది. ఇక్కడ తాత్కాలికంగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ భారీగా సాగునీరు వృథాగా డ్రైన్‌లోకి పోతోంది. చాలా కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న గట్టును పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు. పాశర్లపూడి గ్రామంలోను ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ కూడా గట్టు బలహీనంగా మారింది. మొగలికుదురు, గెద్దాడ గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి ఉంది. వీటికి పంట కాలువలకు నీరు విడుదల చేసేలోగా కనీస మరమ్మతులైనా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా ఇరిగేషన్ శాఖాధికారులు కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

డ్రైన్లుగా మార్చేశారు



పంట కాలువల పరిస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. ప్రతి చెత్త తీసుకువచ్చి పంట కాలువలో వేస్తున్నారు. వీటికి తోడు మండలంలోని పలు గ్రామాల్లో నివాస గృహాల నుంచి మురుగు నీటి గొట్టాలను కాలువల్లోకి ఏర్పాటు చేశారు. దీంతో గతంలో ఎంతో స్వచ్ఛంగా ఉండే కాలువ నీరు పూర్తిగా కాలుష్యం బారిన పడింది. కాలువల్లో ఏర్పాటు చేసిన మురుగునీటి తూరలను తొలగించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చంద్రమౌళి భాస్కరం, రైతు, మామిడికుదురు

బాగు చేయించండి



పంట కాలువలు ఎక్కడికక్కడ పూడుకుపోయాయి. గుర్రపు డెక్క, తూడు కాలువలను పూర్తిగా మూసేశాయి. ఉపాధి హామీలో పనులు నిర్వహిస్తున్నా అవి తాత్కాలిక ఉపశమనమే. మళ్లీ కొద్ది రోజులకే కాలువలు మూసుకుపోయి సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు పలు చోట్ల కాలువ గట్లు బలహీనంగా మారాయి. వాటికి తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేశారు. వీటికి పూర్తి స్థాయిలో పనులు నిర్వహించి గట్లను బలోపేతం చేయాలి.

– రుద్రా శ్రీనివాసరావు, రైతు, మామిడికుదురు

రంగు చూసి నోరూరిందా...

ఆరోగ్యం గోవిందా..


అంబాజీపేటలో విక్రమానికి సిద్ధంగా ఉన్న మామిడిపండ్లు

అంబాజీపేట: ఫల రాజమైన మామిడికి ఉన్న డిమాండ్ మరే పండుకూ ఉండదేమో. వేసవి వచ్చిందంటే చాలు పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని ఆయా ప్రధాన మండలాలు, రహదారి మార్జిన్లలో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ ఏడాది పరిసర ప్రాంతాల్లో మామిడి పంట తక్కువగా ఉండడంతో ఇక్కడి విక్రయిస్తున్న మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్ మేరకు విక్రయించేందుకు వ్యాపారులు తక్కువ సమయంలోనే పచ్చి మామిడిని పక్వానికి తేవడానికి ఆరోగ్యానికి హాని కరమైన కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. గతంలో ఇలాంటి కృత్రిమ పద్ధతుల ద్వారా కాకుండా ఓ గదిలో ఎండుగడ్డి వేసి మామిడికాయలను మాగబెట్టేవారు. ఈ పద్ధతిలో మామిడికాయలు పక్వానికి రావడానికి వారం రోజులు పట్టేది. ప్రకృతి సిద్ధంగా పండిన మామిడి రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికి ఎలాంటి హానీ చేయదు. అయితే తక్కువ సమయంలో మామిడి పండ్లను విక్రయానికి సిద్ధం చేసేందుకు ఇటీవల కార్బైడ్ వినియోగం ఎక్కువైంది. కార్బైడ్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినా చాటుగా ఇంకా అక్కడక్కడా వినియోగిస్తూనే ఉన్నారు. దీనివల్ల మామిడి పండు పసుపు పచ్చగా మారి చూడగానే తినాలని నోరూరిస్తుంది. తీరా ఇంటికి వెళ్లి కోసి చూస్తే లోపలంతా పచ్చి, రుచీ పచీ ఉండదు. అంతే కాకుండా కార్బైడ్ వినియోగించిన మామిడి పండ్లను తినడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం జాతీయ రహదారిలో అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని ఎస్ఈబీ అధికారులు ఆదివారం పట్టుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఇసుకాసురులపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఇటీవల హెచ్చరికలు చేసినా అక్రమార్కులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, ఆంధ్రా ప్రాంత సరిహద్దుల్లో రాత్రి వేళల్లో జోరుగా ఇసుక తవ్వకాలు సాగించి సొమ్ములు చేసుకుంటున్నారు. కొందరు కీలక అధికారుల అండతోనే ఇసుక అక్రమ తరలింపు సాగుతుందన్న చర్చ సర్వత్రా సాగుతుంది.


సుంకరపాలెం జాతీయ రహదారి వద్ద పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

హైస్కూల్‌లో విద్యార్థుల సందడి


కడలి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజోలు: కడలి ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బాల్యంలో విద్యను అభ్యసించిన సమయంలో స్నేహితులంతా ఒకచోట కలుసుకుని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర సుదూర ప్రాంతాల్లో వివిధ ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన స్నేహితులంతా సమ్మేళనానికి విచ్చేశారు. ప్రతి ఏటా కలుసుకుని చదివిన పాఠశాల అభివృద్ధికి కృషి చేసేందుకు తీర్మానించారు.

విద్యార్థుల అపూర్వ కలయిక


చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: ఆత్మీయత.., ఆప్యాయతతో కూడిన పలకరింపులతో ఆలింగనాలు చేసుకుంటూ అనురాగాన్ని ప్రదర్శిస్తూ పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. పాఠశాల నుంచి విడిచి వెళ్లిపోయిన 35 యేళ్ల తరువాత నాటి విద్యార్థులు కలుసుకున్న దృశ్యం ఆదివారం స్థానికులకు కనువిందు చేసింది. ప్రస్తుతం అనుభవిస్తున్న హోదాను, చేస్తున్న ఉన్నత ఉద్యోగాలను మరచి ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. నాడు గురువుల తిట్లు, పొగడ్తలు గుర్తుకు తెచ్చుకున్న అప్పటి విద్యార్థులంతా తమ భవిష్యత్ తీర్చిదిద్దిన నాటి గురువులకు పాదాభివందనాలు చేశారు. చెముడులంకలోని ఎస్‌టీఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఈ దృశ్యాలు కనువిందు చేశాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 1985–90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాటి విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను, చేసిన చిలిపి అల్లరిని గుర్తు చేసుకుని ప్రస్తుతం చేస్తున్న వృత్తి, ఉద్యోగాలను, వ్యాపారాలను వివరించారు. కొంత మంది విద్యార్థులు సమ్మేళనంలో ప్రసంగిస్తూ ఉద్వేగ భరితులయ్యారు. తమకు దూరమైన విద్యార్థులకు, గురువులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. మూడున్నర దశాబ్దాల క్రితం పాఠశాలను విడిచి వెళ్లిపోయిన విద్యార్థులందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చిన కమిటీ సభ్యులను గురువులు అభినందించారు.